

# నీళ్ళధార

జి.ప్రకాష్

**సెలవులొస్తే ఎక్కడికో అక్కడికి తీసుకెళ్లకపోతే పిల్లలు ఒప్పుకోరు. భిలాయ్‌లో పనిచేస్తున్న మా బావమరిదిని చూసినట్టూ వుంటుంది, పిల్లల్ని తిప్పినట్టూ వుంటుంది అని సాయంత్రం రాయ్‌పూర్ పాసెంజరెక్కాను సకుటుంబ సపరివార సమేతంగా. రిజర్వేషన్ దొరక్కపోవడం వల్ల జనరల్ బోగీయే ఎక్కాము.**

"ఇస్‌స్‌స్! ఇటు చూడండి సార్! మా కంపెనీ పబ్లిసిటీ కోసం ఈ వేలం పాట పెట్టాం సార్! ఎవరెక్కువ పాడితే వారికే ఈ బట్టలు చెందుతాయి. మాకు గిట్టుబాటైతే బట్టలిస్తాం, లేకపోతే ఈ ప్రజెంటేషన్స్ ఇస్తాం" అంటూ వేలం పాట పాడేవాడు ఒక సెంటు సీసా, ఒక దువ్వెన, ఒక కుంకం బరిణె ప్రదర్శిస్తున్నాడు.

"ఆ ... కాలక్షేపం బఠాణీలు సార్ కాలక్షేపం బఠాణీలు!" అని ఒకడూ.

"ఆ... కాఫీ టీ సార్ -కాఫీ టీ" అని ఇంకొకడూ.

"ఆ.... జంతికలు చెగోడీలు సార్" అని వేరొకడూ.

ఓ పక్క కుంటికాలు వాళ్లూ, కుంటి చెయ్యివాళ్లూ - "దరమం సెయ్యండయ్యా మీకు పుణ్యాం వుంటాది' ' అంటూ భిక్షాటన.

మరికొందరు యాచకులు సినిమా పాటల బాణీలో కూర్చిన దేవుడి మీద పాటలు -

కాలు కింద పెడదామా అంటే వీల్లేకుండా, అరటిపళ్ల తొక్కలు, బత్తాయికాయి తొక్కలూ కాళ్లకు తగులుస్తూ ఓ పక్క -

చిన్న చింకి చొక్కా, నిక్కరూ, చింపిరి జుట్టుతో, ఓ చిన్న చీపురు కట్ట పట్టుకుని కంపార్టుమెంటు తుడుస్తూ -తుడిచేసిన తరువాత డబ్బులు అడుక్కుంటూ ఓ కుర్రాడు -

ఇలా కంపార్ట్‌మెంటంతా గోలగోలగా ఉంది! ఎవరికి డబ్బులు వేసినా వేయకపోయినా, కంపార్టుమెంటు తుడిచే కుర్రాడికి మాత్రం అందరూ వేశారు. కారణం -రైల్వే ఉద్యోగులు రైలు బయలుదేరిన చోట తుడుస్తారు. గమ్యం చేరేక తుడుస్తారు. ఈలోగా వాళ్ల దర్శనభాగ్యం ప్రయాణీకులకు లభించదు.

ఇంతలో ఒకాయన 35-40 ఏళ్ల మధ్య వయస్కుడు -"అయ్యా నా పర్సు టిక్కెట్టుతో సహా ఎవరో కొట్టేశారండీ! ఎవరైనా ఓ యాభై రూపాయలు సాయం చేస్తే, మా ఊరు చేరుకున్నాక -వారికి మనియార్డరు చేస్తానండయ్యా!" అని బావురుమన్నాడు.

ఇలాంటి కట్టుకథలు ఎన్నో విన్నాము - వింటున్నాము. నేను కథా రచయితనే. అయితే కథలు రాయగలను కాని చెప్పలేను. ఈ లోకంలో కథలు చెప్పేవాళ్లు మాత్రం అసంఖ్యాకంగా ఉన్నారు.

వెంకటరమణమూర్తి కొండకెళ్తాను, జోగు వెయ్యండని ఒకడూ -ఏదో మండలంలో ఏదో గ్రామంలో గుడి కడుతున్నాం చందాలివ్వండని ఒకడూ -ఇలా ఎంతోమంది ఎన్నో అవతారలెత్తి ఎన్నో కథలు చెబుతుంటారు.

మహావిష్ణువు పదే అవతారాలెత్తి అనేకులైన రాక్షసుల్ని చంపాడు. 'పదకొండో' అవతారం మరెత్తలేదు. ఆ అవతార గాథల్ని 'సూతుడు' శౌనకాది మహామునులకు చెప్పాడు. కాని, మనిషి మాత్రం కొన్ని వందల అవతారాలెత్తి -సూతుణ్ని మించి కథ చెప్పేస్తున్నాడు.

"ఫరవాలేదు -ఇవ్వండి! పాపం ఏదో ఆపద ఉన్నాడు. మనమే ఆ పరిస్థితిలో ఉంటే ఏంచేస్తా చెప్పండి?" అని ఆ డబ్బు పోగొట్టుకున్నానని చెబుతు సూతునికి, యాభైరూపాయలిమ్మని సిఫార్సు చేసిం నా శ్రీమతి. సరే అని అతనికి యాభై రూపాయ ఇచ్చాను. అతు కృతజ్ఞతాపూర్వకంగా నమస్కరిం "మీ ఎడ్రెస్సివ్వండి మాస్టారూ! ఎమ్‌వో చేస్తాన అన్నాడు. నాకా యాభై రూపాయలూ 'నీళ్లధారే' అ తెలిసినా, అయిష్టంగానే నా విజిటింగ్ కార్డిచ్చాను.

సెలవుల అనంతరం పిల్లల్ని తీసుకుని మ ఇంటికొచ్చానో లేదో "సార్! మీకు మనియార్డరు" అ పోస్టుమాన్ కేక! నా యాభై రూపాయలూ నా భద్రంగా అందిపోయాయి.

చీకటిలో చిరుదివ్వె -కారు చీకట్లో కాంతిరేఖ కలియుగంలో కనీసం కుంటి కాలుతోనైనా నడుస్తు నిజాయితీ -నాలో ఆశలు చిగురింపజేశాయి.